ఆర్ట్‌గ్యాలరీలో ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన

13 వరకు కొనసాగింపు




మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ అర్ట్‌గ్యాలరీలో ఆకట్టుకుంటున్న స్కప్చర్స్

మాదాపూర్: కళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో నిర్వహిస్తున్న స్కప్చర్ ఎగ్జిబిషన్, 26 మంది కళాకారులు వేసిన చిత్రాల ప్రదర్శన ఆకట్టుకుంటుంది. శ్రీహర్షవేసిన 17 స్కప్చర్స్, కళాకారులు వేసిన 40 చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని ప్రముఖులు కొనియాడారు. ఈ ప్రదర్శనలు ఈనెల 13 వరకు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.





ఆర్ట్‌గ్యాలరీలో ఆకట్టుకుంటున్న చిత్రాలు

ఐటీ కారిడార్ బ్రేక్ డౌన్

విద్యుత్ లైన్లపై విరిగి పడిన చెట్లు

- పేలిన ఇన్సులేటర్లు... కాలిన కేబుల్స్
- రాత్రంతా నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- రంగంలోకి దిగిన జీహెచ్‌ఎంసీ, విద్యుత్ అధికారులు
- 15 గంటలు సహాయక చర్యలు
- అపార్ట్‌మెంట్‌లలోకి వరద నీరు
- చల్లబడ్డ వాతావరణం.. ఊపిరి పీల్చుకున్న జనం



మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

శేరిలింగంపల్లి జోన్ బృందం: భారీ వర్షానికి ఐటీ కారిడార్ ఉలిక్కి పడింది. మంగళవారం సాయంత్రం కురిసిన గాలి, వడగండ్లతో కూడిన భారీ వర్షంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో ఇన్సులేటర్లు పేలిపోగా, కేబుల్స్ కాలి పోయాయి. విద్యుత్ లైన్లపై చెట్లు విరిగి పడటంతో రాత్రంతా సహాయక చర్యలు కొనసాగాయి. ఐటీ కారిడార్‌లోని అన్ని కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం 6 గంటల నుంచి ఒక్కో కాలనీకి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. యుద్ధ ప్రాతిపదికన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు జీహెచ్‌ఎంసీ, విద్యుత్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్లు రజనీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ స్వయంగా రంగంలోకి దిగి సమస్యలను పరిష్కరించారు.



చందానగర్ మంజీరారోడ్డులో చెట్లు, కొమ్మలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది



చల్లబడ్డ వాతావరణం..

వేసవి ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న జనాలకు ఈ వర్షంతో వాతావరణం చల్లబడిపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

◆ జంట సర్కిళ్లలోని మియాపూర్‌లో 13.3 సెంటీమీటర్లు, చందానగర్‌లో 10.7, శేరిలింగంపల్లిలో 9.9, గచ్చిబౌలిలో 9.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పలు చోట కూలిన చెట్లు..

భారీ వర్షం కారణంగా జంట సర్కిళ్ళ పరిధిలో పలు చోట్ల చెట్లు నేలకూలాయి.

◆ చందానగర్ మంజీరా రోడ్డులో పలు చోట్ల చెట్లు రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

నిలిచిపోయిన విద్యుత్ సరఫరా..

చెట్ల కొమ్మలు విరిగిపడటంతో గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, చందానగర్, మియాపూర్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద అదే సమస్య

◆ లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పెద్ద ఎత్తున నీరు చేరడంతో . మంగళవారం సాయంత్రం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి.

◆ లింగంపల్లి నుంచి వచ్చే వాహనాలను నల్లగండ్ల మార్కెట్ మీదుగా రైల్వే ఆర్‌ఓబీ మీదుగా మళ్లించి రాకపోకలకు మార్గం సుగమం చేశారు.

◆ వర్షాకాలంలోనే చిన్న వర్షానికే నెలకొనే సమస్య వేసవిలో కురిసిన వర్షానికి నెలకొనడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభాలు, తీగలు, చెట్లు, కొమ్మలు

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో హిందీ విభాగంలో యూజీ, పీజీ కోర్సులు, పార్ట్‌టైమ్ పీజీ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలను కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మనూ' హిందీ విభాగం హెడ్ డాక్టర్ జివి రత్నాకర్ తెలిపారు. 'మనూ' హిందీయేతర ప్రాంతాల్లో హిందీ భాష, సాహిత్యాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. హిందీ, ఉర్దూ, దఖినీ భాషలు, సంస్కృతిలో అధ్యయనాలు, పరిశోధనల ఇంటర్ డిసిప్లినరీ విధానాలపై డిపార్ట్‌మెంట్ దృష్టి పెట్టిందన్నారు. హిందీ విభాగం తన పాఠ్యాంశాల ద్వారా సాహిత్యంతోపాటు ఫంక్షనల్ హిందీ, ఇతర అనువాద సంబంధిత కోర్సులను అందించడం ద్వారా విద్యార్థులను ప్రోత్సహిస్తుందన్నారు. మెరిట్ ఆధారిత కోర్సు ఎంఏ హిందీలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించడానికి జూన్ 30 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7013507228(డాక్టర్ జీవీ రత్నాకర్)ను సంప్రదించాలని ఆయన కోరారు.

మాదాపూర్ సీసీఆర్టీలో సమ్మర్ క్యాంప్

21 నుంచి 31 వరకు నిర్వహణ

మాదాపూర్: చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు మాదాపూర్‌లోని సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్) లో ఇంద్రదనస్సు పేరిట సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. పోటరీ, క్లే మోడలింగ్, టై అండ్ డై, అప్లిక్ ఆర్ట్, పేపర్ క్రాఫ్ట్, థియేటర్ ఆర్ట్స్, ఫోక్‌డ్యాన్స్, పపెట్రి, స్టోరీ టెల్లింగ్, క్రియేటివ్ రైటింగ్, క్లాసికల్ పెయింటింగ్ తదితర అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 21 నుంచి 31 వరకు క్యాంప్ కొనసాగనుంది. ఉదయం 9గంటల నుంచి 1.30 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోరకు రూ.2 వేలు. మరిన్ని వివరాలకు 9063357895, 8886333799లలో సంప్రదించగలరు.

పాలిసెట్-24 దరఖాస్తు గడువు పొడిగింపు

రాయదుర్గం: పాలిసెట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(పాలిసెట్-2024) దరఖాస్తు గడువు పొడిగించినట్లు రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ తెలిపారు. ఆలస్య రుసుము రూ.100తో ఈనెల 14 వరకు గడువు తేదీని పొడిగించామని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రైస్‌తో మహీంద్రా యూనివర్సిటీ భాగస్వామ్యం..

సాక్షి, సిటీబ్యూరో: సామాజిక సంక్లిష్ట సమస్యల పరిష్కారానికి 'పీపుల్ రీసెర్చ్ ఆన్ ఇండియాస్ కన్స్యూమర్ ఎకానమీ (ప్రైస్)'తో కలిసి పనిచేయనున్నామని మహీంద్రా విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ డాక్టర్ యజ్ మెదురీ తెలిపారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా దేశవ్యాప్తంగా స్థూల వినియోగదారుల ఆర్థిక వ్యవస్థ, పౌరుల పర్యావరణంపై విజ్ఞానాన్ని అందిస్తూ, వాటి వృద్ధి కోసం వినూత్న ప్రణాళికలను రూపొందిస్తున్నామని ప్రైస్ సీఈఓ డాక్టర్ రాజేష్ శుక్లా పేర్కొన్నారు. నగరంలోని మహీంద్రా విశ్వవిద్యాలయం బుధవారం డేటా ఇంటిగ్రేషన్, అనలిటిక్స్‌లో విశేషంగా కృషి చేస్తున్న ప్రైస్ సంస్థతో తమ భాగస్వామ్యాన్ని వెల్లడించింది. ఇందులో భాగంగా ఆర్థిక శాస్త్ర విభాగంలో పరిశోధన ప్రయోజనాలతో పాటు గృహ వినియోగ విధానాలపై మైక్రోడేటాను పొందుతామని వర్సిటీ వీసీ డాక్టర్ యాజ్ మెదురీ పేర్కొన్నారు. కార్యక్రమంలో మహీంద్రా యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ డీన్ ప్రదీప్ రాచెర్ల తదితరులు పాల్గొన్నారు.

కూలిన ప్రహరీ



బృందావన్‌కాలనీలో కూలిన ప్రహరీ

శేరిలింగంపల్లి: పిల్లర్ల కోసం తీసిన గుంతలలో వర్షం నీరు చేరడంతో పక్కనే ఉండే గృహ సముదాయానికి చెందిన ప్రహరీ కూలిపోయిన సంఘటన స్థానిక బృందావన్‌కాలనీలో చోటు చేసుకుంది. అయితే ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోక పోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే..శేరిలింగంపల్లిలోని బృందావన్‌కాలనీలో భవన నిర్మాణం కోసం 10 అడుగుల లోతున పిల్లర్ల నిర్మాణానికి గుంతలు తీశారు. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి పిల్లర్లలో నీరు చేరడంతో పక్కనే ఉండే భవన సముదాయ ప్రహరీ కుప్పకూలింది. ఈ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, 13న పోలింగ్ నిర్ణీత సమయానికి ప్రారంభించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. స్థానిక మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గానికి చెందిన బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, సెక్టోరియల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎంల కమిషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. బీఎల్‌ఓలు ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులను ఓటర్లకు 100శాతం అందించాలని ఆదేశించారు. ఓటర్లు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహించే మహిళా సిబ్బందికి బస ఏర్పాటు చేయాలని, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్‌లతో మెడికల్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఈవీఎంలు పంపిణీకి రూట్‌ల వారీగా అవసరమైన కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే సెక్టోరియల్ అధికారులు ఈవీఎం నోడల్ అధికారికి సమాచారం అందించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అవసరమైన అన్ని చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పటాన్‌చెరు మండలం రుద్రారం శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న సెగ్మెంట్ డీఆర్సీని పరిశీలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ధరేంద్ర కుమార్ మృతదేహం

హఫీజ్‌పేట్: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రమేష్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన ధరేంద్ర కుమార్ యాదవ్ (33) రెండు నెలల క్రితం నగరానికి వలస వచ్చాడు. తన స్నేహితుడు నీరజ్ కుమార్‌తో కలిసి గంగారం జేపి సినిమాస్ వద్ద టీ స్టాల్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురుస్తుండగా అతను టీ స్టాల్‌ను మూసివేసేందుకు విద్యుత్ స్తంభానికి ఉన్న బోర్డు టీ స్టాల్‌ను చైన్‌తో కడుతుండగా కరెంట్ షాక్ తగలడంతో కింద పడిపోయాడు. స్థానికులు అతడిని అర్చన హాస్పిటల్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి బంధువు అజిత్‌కుమార్ యాదవ్ బుధవారం చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

10 వరకు పోస్టల్ బ్యాలెట్

గచ్చిబౌలి: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను మరో రెండు రోజుల పాటు పొడిగించినట్లు శేరిలింగంపల్లి ఏఆర్‌ఓ స్నేహ శబరిష్ తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని శేరిలింగంపల్లి జోనల్ కార్యాయలంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 10 వరకు ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 4082 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు 3333 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. హోమ్ ఓటింగ్‌లో 222 మందిని గుర్తించగా 203 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ల పరిశీలన

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి పరిధిలోని పలు వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లను ఎండీ సుదర్శన్ రెడ్డి బుధవారం సందర్శించారు. కొండాపూర్, మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, బంజారాహిల్స్, సోమాజిగూడ ఫిల్లింగ్ స్టేషన్లను ాకస్మికంగా తనిఖీ చేసి ట్యాంకర్ డెలివరీకి సంబంధించిన ఇన్ అండ్ ఔట్ లాగ్ బుక్స్ పరిశీలించారు. ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న నీటి వివరాలు, ట్యాంకర్లు, డ్రైవర్ల సంఖ్య, నీటి పరిమాణం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్యాంకర్ బుకింగ్, డెలివరీ టైమింగ్స్‌ను కచ్చితంగా లాగ్ బుక్ లో రాయాలని సూచించారు. రాత్రి సమయాల్లోనూ నీటి సరఫరా చేసి.. ట్యాంకర్ల డెలివరీ సమయాన్ని తగ్గించాలని ఆదేశించారు. మరో 3 రోజులు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో.. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆపరేషన్స్ డైరెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని సూచించారు. నీటి కలుషిత నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షం కారణంగా నీళ్లు నిలిచే ప్రాంతాల్లో డీసిల్టింగ్ చేయాలని చెప్పారు. మ్యాన్ హోల్స్ ఓవర్ ఫ్లో అవ్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీజీఎం టీవీ శ్రీధర్, జీఎం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మియాపూర్: అకాల వర్షానికి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీశ్రీనగర్ కాలనీలో మంగళవారం కురిసిన అకాల వర్షానికి ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల్లో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారీ వర్షం కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నాలా, వరదనీటి కాల్వల్లో ఎప్పటికప్పుడు పూడికతీసి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీ, బస్తీల్లో బురద, మట్టి తొలగించాలన్నారు. రఘునాథ్ రెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

జోరుగా కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న జగదీశ్వర్ గౌడ్



సాయినగర్‌లో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జగదీశ్వర్ గౌడ్

- చేవెళ్ల ఎంపీగా డాక్టర్ రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం
- శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్

హఫీజ్‌పేట్: చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీనగర్‌లో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హస్తం గుర్తుకు ఓటు వేసి చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ప్రభుత్వం తరపున అన్ని విధాల కాలనీలలో ఉన్న సమస్యల పరిష్కరిస్తామన్నారు. రంజిత్ రెడ్డిని గెలిపించుకుంటే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో...

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో స్థానిక నాయకులతో కలిసి జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నారని, చేవెళ్ళ ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశముందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించండి..



ఇంటింటి ప్రచారం చేస్తున్న దృశ్యం



గోపన్‌పల్లి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

- అభివృద్ధికి స్వాగతం పలకండి
- గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా

రాయదుర్గం: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి అభివృద్ధికి ప్రజలు స్వాగతం పలకాలని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి, వీకర్ సెక్షన్‌కాలనీలో బుధవారం సాయంత్రం ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరూ అధైర్యపడవద్దని, ప్రజల సమస్యలు, కష్టాలు, బాధలు అన్నీ తీరేలా కొండంత ధైర్యాన్ని ఇచ్చే నేత కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ప్రజలంతా మరోసారి బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి సేవ చేయడానికి బీఆర్‌ఎస్ పార్టీ సిద్ధంగా ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ఏడాది పొడవునా అయిదేళ్ల పాటు అందుబాటులో ఉండే నాయకులను మాజీ సీఎం కేసీఆర్ తయారు చేశారని గుర్తు చేశారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ వార్డు, ఏరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల బతుకుల్లో మార్పు రాలేదు

- తెలంగాణ ప్రజల బతుకుల్లో మార్పు రాలేదు
- తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై



ఐటీ ఉద్యోగుల ఫోరమ్‌లో పాల్గొన్న అన్నామలై, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గచ్చిబౌలి: ప్రభుత్వం మారినా తెలంగాణ ప్రజల బతుకుల్లో మార్పులు రాలేదని తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై అన్నారు. గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్ సెంటర్‌లో ఫోరమ్ ఫర్ ఐటీ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మంగళవారం రాత్రి చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో లెట్స్ యునైట్ వికసిత్ భారత్ పేరుతో ముఖాముఖి అయ్యామని గుర్తు చేశారు.తెలంగాణలో ప్రభుత్వం మారినా ప్రజల జీవన విధానంలోనూ, పాలనలోనూ ఎలాంటి మార్పు రాలేదన్నారు. ప్రజలను దోచుకోవడంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఎలాంటి తేడా లేదని ఆరోపించారు. ప్రధాని మోదీ ముందు చూపు, దార్శనికతతో మనదేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. అవినీతికి తావు లేకుండా దేశంలో పాలన అందించిన ఘనత బీజేపీకి మాత్రమే దక్కుతుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రజలంతా ముఖ్యంగా ఐటీ ఉద్యోగులు ముందుకొస్తున్నారని, ఆయన గెలువడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రూరల్, అర్బన్ ప్రాంతాల్లో ఎక్కడ చూసిన బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. దేశంలో మళ్లీ ప్రధానిగా నరేంద్ర మోదీని గెలిపించాలని, చేవెళ్లలో తనను గెలిపించాలని నిర్ణయించుకున్నారని, ఐటీ ఉద్యోగులు కూడా అందుకు మద్దతు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్, అభ్యర్థి సతీమణి, అపోలో ఆస్పత్రి జేఎండీ డాక్టర్ సంగీతారెడ్డి, సోదరి అనితా రెడ్డి, పలువురు ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు.